ఆంధ్రజ్యోతి


ANDHRAJYOTHY

డాక్టర్ బీఆర్ అంబేడ్కర్

కోనసీమ

జిల్లా వార్తలు

బుధవారం 21 ఆగస్టు 2024 | 5



యువ జంటపై చాకుతో దాడి

అబ్బాయి కుటుంబంపై అమ్మాయి తండ్రి ఎటాక్

పలువురికి గాయాలు 7లో

రాజీవ్‌కు ఘన నివాళి



అమలాపురంలో..

8లో

స్థానిక సంస్థలకు రాజ్యాంగ బద్ధమైన హక్కులు, విధులు కల్పించడంతో పాటు ఢిల్లీ నుంచి గల్లీ వరకు జనాభా ఆధారంగా నిధులు విడుదల చేసిన ఘనత మాజీ ప్రధాని రాజీవ్ గాంధీకే దక్కుతుందని ఏఐసీసీ వర్కింగ్ కమిటీ సభ్యుడు గిడుగు రుద్రరాజు అన్నారు. రాజీవ్‌గాంధీ జయంతి సందర్భంగా మంగళవారం రుద్రరాజు అమలాపురంలో పలు ప్రాంతాల్లో రాజీవ్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు..

నేడు జిల్లా బంద్



మాట్లాడుతున్న డీబీ లోక్

8లో

దళితుల ఐక్యతను దెబ్బతీసే విధంగా, దళిత బహుజనుల రిజర్వేషన్లను ఎత్తివేసే కుట్రలు చేస్తూ సుప్రీంకోర్టు ఇచ్చిన ఎస్సీ వర్గీకరణ తీర్పుకు వ్యతిరేకంగా బుధవారం జిల్లా బంద్‌కు పిలుపునిచ్చామని మాలమహానాడు నాయకులు తెలిపారు. అన్ని వర్గాలు బంద్‌కు సహకరించాలని కోరారు. దళిత ఐక్యవేదిక, వర్గీకరణ వ్యతిరేక, పోరాట సమితి సమావేశం జంగా బాబూరావు అధ్యక్షతన మంగళవారం అమలాపురంలో జరిగింది.

● (అమలాపురం టౌన్)



నిఘాలో రికార్డు గదులు

సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలని కలెక్టర్ ఆదేశాలు

అమలాపురంటౌన్, ఆగస్టు 20: జిల్లాలోని ముఖ్యమైన ప్రదేశాలు, ప్రభుత్వ కార్యాలయంలో రికార్డు రూమ్‌లను పర్యవేక్షించేందుకు సీసీ కెమెరాలను ఏర్పాటు చేయాలని కలెక్టర్ ఆర్.మహేష్‌కుమార్ ఆయా శాఖల అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్‌లో మంగళవారం ఎస్ఎన్ఆర్ఈ డేటా ప్రైవేట్ లిమిటెడ్ సంస్థ ప్రతినిధులు, అధికారులతో కలెక్టర్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలోని ముఖ్యమైన ప్రదేశాలతో పాటు తహసీల్దారు కార్యాలయంలోని రికార్డు రూమ్‌లు, సంక్షేమ హాస్టల్స్, ఇసుక రీచ్‌లు, ఇసుక నిల్వ కేంద్రాల వద్ద సీసీ టీవీ కెమెరాలు ఏర్పాటు చేసి అమలాపురం కలెక్టరేట్‌లోని కంట్రోల్ రూమ్ ద్వారా పర్యవేక్షించే విధంగా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. సీసీ కెమెరాల ఏర్పాటుకు అవసరమైన ఇంటర్నెట్, విద్యుత్ సదుపాయాలను కల్పించాలన్నారు. ఆగస్టు 23లోపు ఈ సీసీ కెమెరాలు ఏర్పాటు చేసి నివేదిక అందించాలని సూచించారు. సమావేశంలో ఇండస్ట్రియల్ ఏడీ శివరామకృష్ణ, సంస్థ ప్రతినిధి విష్ణురాజు, గౌతమ్, కాకినాడ స్మార్ట్ సిటీ కార్పొరేషన్ అధికారులు పాల్గొన్నారు.



మండపేట తహసీల్దార్ కార్యాలయంలో నిర్లక్ష్యంగా పడివేసిన ఫైళ్లు ఇవే..

నిర్లక్ష్యంగా..

మండపేట, ఆగస్టు 20: వైసీపీ ప్రభుత్వంలో జరిగిన అరాచకాలకు ఆనవాళ్లు లేకుండా ప్రభుత్వ శాఖలకు చెందిన రికార్డులు కార్యాలయాల్లో దగ్ధమవుతున్న విషయం తెలిసిందే. అప్పుడు మదనపల్లి, ఇటీవల ధవళేశ్వరం ప్రభుత్వ కార్యాలయాల్లో ముఖ్యమైన ఫైళ్లు కాలిబూడిదయ్యాయి. అయితే ఇన్ని సంఘటనలు జరుగుతున్నా ప్రభుత్వ అధికారుల్లో ఇంకా చలనం వచ్చినట్లు కనిపించడం లేదు. మండపేట తహసీల్దార్ కార్యాలయంలో రెవెన్యూ శాఖకు సంబంధించిన రికార్డులు పరిశీలిస్తే వారి నిర్లక్ష్యం ఏపాటిదో అర్థమవుతుంది. పత్రాలు కుప్పలు తెప్పలుగా కార్యాలయం పైభాగంలో ఉన్న గదిలో కుప్పగా పోసి వదిలేశారు. కనీసం వాటికి భద్రత కూడా లేకుండా పోయింది. ఆఫీసు పైభాగంలో ఉండే హాలులో రికార్డులు పడి ఉన్నాయి. ఇక్కడే వివిధ ప్రభుత్వ శాఖలకు చెందిన అధికారులు ప్రభుత్వం నిర్వహించే వీడియో కాన్ఫరెన్స్, గ్రీవెన్స్ కార్యక్రమాలు నిర్వహిస్తుంటారు. వరుస సంఘటనలు చూసి అయినా ఆ ఫైల్స్‌కు భద్రత కల్పించాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

ఉత్తమ ఉపాధ్యాయ అవార్డులకు
దరఖాస్తుల ఆహ్వానం

ముమ్మిడివరం, ఆగస్టు 20: ఉత్తమ ఉపాధ్యాయ అవార్డుల కోసం జిల్లాలో పనిచేస్తున్న ఉపాధ్యాయుల నుంచి దరఖాస్తులను కోరుతున్నామని జిల్లా విద్యాశాఖాధికారి ఎం.కమలకుమారి చెప్పారు. జిల్లాలోని ప్రభుత్వ జిల్లా పరిషత్, మండల పరిషత్, ఎయిడెడ్, పురపాలక సంఘాల యాజమాన్యాలు, ప్రైవేట్ ఇతర యాజమాన్యాలు మినహా ఇతర యాజమాన్యాలలో నడిచే ప్రాథమిక, ప్రాథమికోన్నత ఉన్నత పాఠశాలల్లో పనిచేసే ఉపాధ్యాయులు ఈనెల 27లోపు తమ దరఖాస్తులు అందించాలన్నారు. 15 ఏళ్ల పాటు టీచింగ్ అనుభవం ఉన్న అన్ని కేటగిరీలకు చెందిన ఉపాధ్యాయులు, హెచ్ఎంలు జిల్లా స్థాయిలో ఉత్తమ ఉపాధ్యాయ పురస్కారానికి సంబంధించిన నియమ, నిబంధనలు మండల విద్యాశాఖాధికారి కార్యాలయంలో పొందుపరిచామన్నారు. అర్హత కలిగిన ఉపాధ్యాయులు మండల విద్యాశాఖాధికారి కార్యాలయంలో సంప్రదించి దరఖాస్తును ఈనెల 27వ తేదీకల్లా సంబంధిత అధికారులు ద్వారా జిల్లా విద్యాశాఖాధికారికి అందించాలని ఆమె కోరారు.



ఎమ్మెల్యే వేగుళ్ల సమక్షంలో సోమవారం టీడీపీలో చేరిన మున్సిపల్ వైస్‌చైర్మన్, కౌన్సిలర్లు

మండపేట మున్సిపాల్టీలో పార్టీల లెక్కలు మారుతున్నాయి..బలాబలాల్లో తేడాలు వస్తున్నాయి. అధికార వైసీపీ కౌన్సిలర్లు టీడీపీ వైపు చూస్తున్నారు.. దీంతో రోజురోజుకు వైసీపీ బలం తగ్గుతోంది. ఇంకాస్త తగ్గితే అధికార మార్పిడి ఖాయంగా కనిపిస్తోంది. ఇప్పటికే పలువురు కౌన్సిలర్లు టీడీపీలో చేరారు. దీంతో మున్సిపాల్టీలో టీడీపీ పాగా వేసేందుకు రంగం సిద్ధమవుతోంది..

అధికార వైసీపీ పాలకవర్గానికి కౌన్సిలర్లు గుడ్‌బై చెప్పి కూటమి ప్రభుత్వంలో చేరుతున్నారు. దీంతో మండపేట మున్సిపాల్టీలో వైసీపీకి ఎదురుదెబ్బ తప్పటం లేదు. ఇప్పటికే వైస్ చైర్మన్ పిల్లి గణేశ్వరరావుతో సహ మరో ఇద్దరు వైసీపీ కౌన్సిలర్లు వైసీపీకి గుడ్‌బై చెప్పి టీడీపీ కండువా కప్పుకున్నారు. మరికొంత మంది త్వరలో వైసీపీకి గుడ్‌బై చెప్పి అధికార టీడీపీలో చేరేందుకు ఉవ్విళ్లూరుతున్నారు. వైసీపీ ప్రభుత్వంలో ఎమ్మెల్యే వేగుళ్లపై కౌన్సిల్‌లో అధికార పార్టీకి చెందిన కొంతమంది కౌన్సిలర్లు ఎదురు దాడి చేయడంతో పాటు వ్యక్తిగత దుషణలకు కూడా పాల్పడ్డారు. మొత్తం మీద వైసీపీ అధికారంలో ఉండగా కౌన్సిల్‌లో అధికార పార్టీకి చెందిన కౌన్సిలర్లు దూకుడు ప్రదర్శించారు. ఇప్పుడు రాష్ట్రంలో అధికారం లేకపోవటం, స్థానికంగా కూడా పార్టీ బలం కోల్పోవటంతో వైసీపీ కౌన్సిల్ సభ్యులు పునరాలోచనలో పడ్డారు. ఇక వేరే దారి లేక కౌన్సిలర్లు చాలా మంది అధికార టీడీపీలో చేరేందుకు తహతహలాడుతున్నారు.

● (మండపేట)





మండపేట మున్సిపాల్టీలో అధికార వైసీపీకి గండి

టీడీపీ వైపు కౌన్సిలర్ల చూపు

ఇప్పటికే నలుగురి చేరిక

సిద్ధంగా మరో ఐదుగురు?

అలా జరిగితే టీడీపీకే పీఠం?

లెక్కలు మారుతున్నాయి..

ఇదీ లెక్క..

ఎన్నికలకు ముందే వైసీపీకి చెందిన ఒక కౌన్సిలర్ టీడీపీలో చేరారు. ఇప్పుడు మరో ముగ్గురు చేరడంతో మొత్తం పార్టీ మారిన వారి సంఖ్య నలుగురికి చేరింది. ప్రస్తుతం కౌన్సిల్‌లో టీడీపీకి సొంత బలం ఏడుగురు సభ్యులు ఉన్నారు. ఎమ్మెల్యేతో కలుపుకుని 8 మంది సంఖ్యా బలం ఉంది. పార్టీలో చేరిన వారితో కలిపితే టీడీపీ బలం 12కి చేరింది. మరో ఐదుగురు సభ్యులు కూడా టీడీపీలో చేరేందుకు సిద్ధంగా ఉన్నారన్న ప్రచారం జోరుగా సాగుతోంది. అదే జరిగితే మున్సిపాల్టీలో వైసీపీ పీఠం కూలిపోవటం ఖాయంగా కనిపిస్తోంది.



బీసీ మహిళకు కేటాయించిన చైర్‌పర్సన్ పదవి టీడీపీలో ఎవరికి ఇస్తారనే దానిపై కూడా ఊహాగానాలు వినిపిస్తున్నాయి. ఒకవేళ టీడీపీలో బీసీ మహిళకు చైర్మన్ పదవి ఇవ్వాల్సి వస్తే వైసీపీకి చెందిన మహిళా కౌన్సిలర్‌తో రాజీనామా చేయించి ఆ స్థానంలో గతంలో టీడీపీ ప్రభుత్వంలో వైస్ చైర్మన్‌గా పనిచేసిన గడి సత్యవతిని బరిలోకి దింపి చైర్మన్‌గా చేసే ఆలోచన ఉన్నట్లు సమాచారం.

పీఠం దక్కాలంటే..

టీడీపీ కంచుకోటగా ఉండే మండపేట మున్సిపాల్టీలో తిరిగి వైసీపీ చేతి నుంచి టీడీపీ చేతికి పగ్గాలు చిక్కనున్నాయి. 2021లో జరిగిన ఎన్నికల్లో 30 మంది కౌన్సిలర్లకు గాను 22 మంది కౌన్సిలర్లు గెలుపొందటంతో వైసీపీకి చైర్మన్ పీఠం దక్కింది. కౌన్సిల్ పదవీ కాలం 2026 వరకు ఉంది. అయితే ఈలోపే వైసీపీ రాష్ట్రంలో అధికారం కోల్పోవటంతో ఇక్కడ వైసీపీ పాలకవర్గ కౌన్సిలర్లు అధికార పార్టీలోకి దూకుతున్నారు. 22 మందిలో ఇప్పటికే నలుగురు టీడీపీలోకి జంప్ అయ్యారు. మరో ఐదుగురు సిద్ధంగా ఉన్నారని అంటున్నారు. ఇప్పటికే కౌన్సిల్‌లో 22 మంది సభ్యుల్లో నలుగురు బలం తగ్గింది. ప్రస్తుతం 18కి చేరింది. మరో ఐదుగురు బలం తగ్గితే 13కి చేరుతుంది. అప్పుడు కౌన్సిల్‌లో వైసీపీకి బలం లేకుండా పోతుంది. అప్పుడు టీడీపీకే మున్సిపల్ పీఠం దక్కనుంది. ప్రస్తుతం టీడీపీ బలం 12కి చేరింది. మరో ఐదుగురు కానీ టీడీపీలో చేరితే 17కి చేరి పగ్గాలు చేపట్టేందుకు సంఖ్య సరిపోతుంది. మున్సిపాల్టీలో 30 మంది సభ్యులకు గాను 22మంది వైసీపీ, 7 టీడీపీ, 1స్వతంత్ర కౌన్సిలర్లు ఉన్నారు.

23న ప్రతి గ్రామంలో సభలు



సమీక్ష నిర్వహిస్తున్న కలెక్టర్ మహేష్‌కుమార్

అమలాపురం, ఆగస్టు 20(ఆంధ్రజ్యోతి): ఉపాధి హామీ పథకం కింద చేపట్టాల్సిన పనులను గుర్తించి నివేదికలను సిద్ధం చేయాలని జిల్లా కలెక్టర్ ఆర్.మహేష్‌కుమార్ ఆదేశించారు. ఈ నెల 23న ప్రతిగ్రామంలో సభలు నిర్వహించాలన్నారు. అమలాపురంలోని కలెక్టర్ కార్యాలయంలో మంగళవారం ఉపాధి హామీ పనులపై వివిధ శాఖల అధికారులతో కన్వర్జెన్స్ సమావేశం నిర్వహించారు. అధికారులు తమ శాఖలలో ఉపాధి హామీ పనులు కింద చేయడానికి అవకాశం ఉన్న వాటిని కలెక్టర్ దృష్టికి తీసుకువచ్చారు. ఈ పథకం కింద 57 లక్షల పనిదినాలను జిల్లాకు లక్ష్యంగా నిర్ణయించారు. పనులను గుర్తించి ఈ లక్ష్యాలను చేరుకునేందుకు అధికారులు సమన్వయంతో పనిచేయాలని అధికారులకు కలెక్టర్ విజ్ఞప్తి చేశారు. జిల్లాలో 266 రకాల పనులను మెటీరియల్, లేబర్ కాంపోనెంట్ల కింద చేపట్టవచ్చునని పేర్కొన్నారు. జిల్లాలో వివిధ శాఖల పరిధిలో ఉపాధి పథకం కింద చేపట్టే పనులను గుర్తించి ప్రతిపాదనలు పంపాలని ఆదేశించారు. ఎంపీడీవోలు, ఇతర మండల స్థాయి అధికారులు సమన్వయంతో పనిచేసి పనులు గుర్తించాలని సూచించారు. ఆగస్టు 23న గ్రామాల్లో ప్రత్యేక గ్రామ సభలు నిర్వహించి పనులు నిర్ణయించాలని సూచించారు. ఈ గ్రామ సభలకు 30 శాతం మంది ప్రజలు హాజరయ్యేలా చర్యలు తీసుకోవాలని కోరారు. సభలలో వేజ్ సీకర్స్‌కు ఉపాధి పథకం కింద కలిగే హక్కులపై అవగాహన కల్పించాలని పనుల పురోగతిపై సమాచారం చెప్పాలని, 2024-25లో చేపట్టే పనులు ప్రతిపాదనలు తెలిపాలని, సోషల్ ఆడిట్‌పై అవగాహన కల్పించాలని కలెక్టర్ సూచించారు. మండల స్థాయి అధికారులు ముందుగా సమావేశమై ప్రణాళికలు రూపొందించుకోవాలని సూచించారు. మరో రెండు రోజుల్లో జరిగే కన్వర్జెన్సీ సమావేశానికి అధికారులు నివేదికలు సమర్పించాలని సూచించారు. జేసీ టి.నిషాంతి, డీఆర్వో ఎం.వెంకటేశ్వర్లు, డ్వామా పీడీ మధుసూదన్, జిల్లా హార్టికల్చర్ అధికారి బీవీ రమణ పాల్గొన్నారు.

దేవాలయాల అభివృద్ధికి ప్రభుత్వం చర్యలు

కలెక్టర్ మహేష్‌కుమార్

అమలాపురంటౌన్, ఆగస్టు 20: దేవాలయాల అభివృద్ధి కోసం ప్రభుత్వం ప్రసాద్ పథకాన్ని అమలు చేస్తుందని కలెక్టర్ మహేష్ కుమార్ పేర్కొన్నారు. దేవాలయాల అభివృద్ధికి ప్రతిపాదనలు సిద్ధం చేయాలని దేవదాయశాఖ అధికారులను ఆయన ఆదేశించారు. కలెక్టరేట్‌లో మంగళవారం దేవదాయశాఖ అధికారులతో ఆయన సమీక్ష నిర్వహించారు. జిల్లాలో దేవదాయశాఖ పరిధిలో ఎన్ని ఆలయాలు ఉన్నాయి, ఆయా దేవాలయాలలో నిర్వహిస్తున్న కార్యక్రమాల వివరాలను అడిగి తెలుసుకున్నారు. జిల్లాలో సుమారు 216 ఎకరాల దేవాలయ భూములు ఆక్రమణకు గురయ్యాయని అధికారులు కలెక్టర్ దృష్టికి తీసుకువచ్చారు. తక్షణం ఆక్రమణలకు గురైన భూములపై చర్యలు తీసుకోవాలని ఆ శాఖ అధికారులను ఆదేశించారు. కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న ప్రసాద్ పథకం కింద జిల్లాలో ప్రాముఖ్యత కలిగిన దేవాలయాలను అభివృద్ధి చేపట్టే దిశగా ప్రతిపాదనలు సిద్ధం చేయాలని కోరారు. పెద్దమొత్తంలో ప్రసాదాలు తయారు చేస్తున్న దేవాలయాలలో ఫుడ్‌సెఫ్టీ అధికారులు తనిఖీలు నిర్వహించి నాణ్యతను పరిశీలించాలన్నారు. దేవాలయ భూములు కౌలుకు చేస్తున్న రైతులు నిర్ణీత సమయంలో కౌలు చెల్లించేలా చర్యలు తీసుకుని గత బకాయిలు కూడా వసూలు చేయాలని ఆదేశించారు. సమావేశంలో జిల్లా రెవెన్యూ అధికారి ఎం.వెంకటేశ్వర్లు, ఆర్డీవో జి.వేశవర్ధనరెడ్డి, జిల్లా దేవదాయ ధర్మదాయశాఖ అధికారి ఎం.లక్ష్మీనారాయణ, మున్సిపల్ కమిషనర్ ఎస్.మనోహర్, ఆలయ ఈవో సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

పొలాలను పరిశీలిస్తున్న బోసుబాబు తదితరులు



1.52 లక్షల ఎకరాల్లో
వరినాట్లు పూర్తి

జిల్లా వ్యవసాయాధికారి బోసుబాబు

అల్లవరం, ఆగస్టు 20: జిల్లాలో ఇప్పటి వరకు 1.52 లక్షల ఎకరాలలో వరినాట్లు, 64 వేల ఎకరాలలో వరి ఈ-పంట నమోదు పూర్తి అయిందని జిల్లా వ్యవసాయాధికారి బోసుబాబు తెలిపారు. అల్లవరం మండలం బెండమూర్లంక గ్రామంలో వరి ఈ-పంట నమోదు ప్రక్రియను మంగళవారం ఆయన పరిశీలించారు. ప్రతి రైతు తాను పండించిన పంటకు విధిగా ఈ పంట నమోదు చేయించుకోవాలన్నారు. దీని వల్ల రైతులు పంట నష్టపరిహారం, పంటల బీమా, వడ్డీ లేని రుణాలు, ధాన్యం కొనుగోలు, ప్రభుత్వ పథకాలు అమలవుతాయన్నారు. అల్లవరం మండలంలో 2380 ఎకరాలలో వరినాట్లు 1650 ఎకరాలలో ఈ-పంట నమోదు పూర్తి అయ్యిందన్నారు. వరిలో కుళ్ల తెగులు ఆశించకుండా హెక్సాకోనజోల్ 2 ఎంఎల్ ఒక లీటరు నీటికి కలిపి పిచికారీ చేయాలన్నారు. ఏడీఏ ఎంఏ షంషీ, ఏవో ఎస్వీవీ సత్యనారాయణ, సర్పంచ్ బర్రే సీతారత్నం, ప్రకృతి వ్యవసాయాధికారి శ్రీనివాసరావు, ఏఈవో శివమోహన్, వీఏఏ జల్లి విజయలక్ష్మి, రైతులు ఈలి స్వామి, గోపాలకృష్ణ, నాగభూషణం తదితరులు పాల్గొన్నారు.



ఆవిర్భావ వేడుకలో మాట్లాడుతున్న రామ్మోహనరావు

సమాజాభివృద్ధిలో జేఎన్టీయూకే పాత్ర కీలకం

వర్సిటీ 17వ ఆవిర్భావ వేడుకలో ఉన్నత విద్యా మండలి ఇన్‌చార్జి చైర్మన్ రామ్మోహనరావు

- ఎంవీఆర్ కృష్ణతేజకు యంగ్ అచీవర్ అవార్డు ప్రదానం
- ప్రత్యేక అతిథిగా హాజరైన కేఎస్‌పీఎల్ సీఓఓ మెర్ల మురళీధర్

జేఎన్టీయూకే, ఆగస్టు 20: కాలేజ్ ఆఫ్ ఇంజనీరింగ్, కాకినాడ పేరుతో 1946లో ఏర్పడిన జేఎన్టీయూ 2008లో యూనివర్శిటీగా మారిందని రాష్ట్ర ఉన్నత విద్యా మండలి ఇన్‌చార్జి చైర్మన్ ప్రొఫెసర్ కె.రామ్మోహనరావు అన్నారు. జేఎన్టీయూకే 17వ ఆవిర్భావ వేడుకలను ఇన్‌చార్జి రిజిస్ట్రార్ వి.రవీంద్రనాథ్ అధ్యక్షతన వర్సిటీలోని అలూమ్ని ఆడిటోరియంలో మంగళవారం నిర్వహించారు. ముఖ్య అతిథిగా ఏపీఎస్సీహెచ్‌ఈ చైర్మన్ రామ్మోహనరావు, ప్రత్యేక అతిథిగా కేఎస్ పీఎల్ సీవోవో మెర్ల మురళీధర్ హాజరు కాగా ఇన్‌చార్జి వీసీ కేవీఎస్‌జీ మురళీకృష్ణ, రెక్టార్ కేవీ రమణ పాల్గొనగా అతిథులు జ్యోతిప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. రామ్మోహనరావు మాట్లాడుతూ ఈ కళాశాల ఎందరో మేధావులు, ఐఏఎస్, ఐపీఎస్ అధికారులను దేశానికి అందించి సమాజాభివృద్ధిలో తనదైన పాత్ర పోషించిందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఏపీని మాదకద్రవ్యాల రహిత రాష్ట్రంగాను, మాదకద్రవ్యాల రహిత విద్యా సంస్థలుగా తీర్చిదిద్దాలనే లక్ష్యంతో ముందుకు వెళ్తోందన్నారు. వీసీ మురళీకృష్ణ మాట్లాడుతూ వర్సిటీ అనుబంధ కళాశాలల్లో ప్రతిరోజూ జాతీయ గీతం ఆలపించిన తర్వాతే తరగతులు ప్రారంభించేలా ఉత్తర్వులు జారీ చేశామన్నారు. విద్యార్థుల్లో దేశభక్తి పెంచేందుకు వర్సిటీ పరిపాలనా భవనం ముందు భారత జాతీయ జెండాతో పాటు ప్రపంచంలోని 197 దేశాల జాతీయ జెండాలను ఏర్పాటు చేయనున్నట్టు తెలిపారు. కల్చర్, ఆర్ట్స్ ఔట్‌రీచ్ డైరెక్టరేట్ ఏర్పాటు చేశామన్నారు. దీనిద్వారా వర్సిటీ అనుబంధ కళాశాలల్లో తల్లిదండ్రులను కోల్పోయిన విద్యార్థులను దత్తత తీసుకుని వారి బాగోగులు చూసుకుంటామన్నారు. మురళీధర్ మాట్లాడుతూ విద్యార్థులు పరిశోధనలపై దృష్టిసారించి సమాజహితమైన ఆవిష్కరణలు చేపట్టాలని సూచించారు. ఈ సందర్భంగా డిప్యూటీ సీఎం ఓఎస్డీ ఎంవీఆర్ కృష్ణతేజకు యంగ్ అచీవర్ అవార్డును అతిథులు ప్రదానం చేశారు. అనంతరం కృష్ణతేజ మాట్లాడుతూ జీవితంలో ఎదురైన ఓటముల ద్వారా విజయం చేరువవుతుందని, వర్సిటీలో సివిల్ సర్వీసెస్ క్లబ్ ఏర్పాటు చేయాలని సూచించారు. వివిధ రంగాల్లో ప్రతిభ కనబరిచిన వర్సిటీ, అనుబంధ కళాశాలల అధ్యాపకులకు, ప్రిన్సిపాల్స్‌కు, యాజమాన్యాలకు, క్రీడాకారులకు, విద్యార్థులకు అవార్డులను ప్రదానం చేశారు. పూర్వపు వైస్ చాన్సలర్లు, రిజిస్ట్రార్లను సత్కరించారు. కార్యక్రమంలో డైరెక్టర్లు, ప్రిన్సిపాల్స్, యాజమాన్యాల ప్రతినిధులు, విద్యార్థులు పాల్గొన్నారు.



కృష్ణతేజకు యంగ్ అచీవర్ అవార్డు ప్రదానం చేస్తున్న రామ్మోహనరావు, ఇన్‌చార్జి వీసీ మురళీకృష్ణ





ఉత్తమ ప్రతిభా కళాశాల అవార్డుతో ప్రగతి యాజమాన్యం, ఉత్తమ ప్రిన్సిపాల్ అవార్డు అందుకుంటున్న డాక్టర్ శ్రీకాంత్

ప్రగతి ఇంజనీరింగ్ కళాశాలకు ఉత్తమ ప్రతిభా ఇనిస్టిట్యూట్ అవార్డు

జేఎన్టీయూకే 17వ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా ఉత్తమ ప్రతిభ కనబరిచిన ఇనిస్టిట్యూట్‌గా ప్రగతి ఇంజనీరింగ్ కళాశాల ఎంపికైందని చైర్మన్ డాక్టర్ పరుచూరి కృష్ణారావు తెలిపారు. బెస్ట్ పెర్ఫార్మింగ్ ఇనిస్టిట్యూట్ అవార్డును ప్రగతి ఇంజనీరింగ్ కళాశాల వైస్ ప్రెసిడెంట్ మేకా సతీష్, ప్రిన్సిపాల్ డాక్టర్ జి.నరేష్‌లకు ఏపీఎస్సీహెచ్‌ఈ ఇన్‌చార్జి చైర్మన్ కె.రామ్మోహనరావు, జేఎన్టీయూకే ఇన్‌చార్జి వీసీ కేవీఎస్‌జీ మురళీకృష్ణ అందజేశారు. కార్యక్రమంలో కళాశాల మేనేజ్‌మెంట్ డైరెక్టర్ ఎంవీ హరినాథబాబు, అకడమిక్ డైరెక్టర్ డాక్టర్ కె.సత్యనారాయణ, సీఈ డాక్టర్ వై.జయబాబు, డీన్ రాధికామణి, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

కాకినాడ ఐడియల్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ ప్రిన్సిపాల్ డాక్టర్ శ్రీకాంత్‌కు అప్రిసియేషన్ అవార్డును ఏపీఎస్సీహెచ్‌ఈ ఇన్‌చార్జి చైర్మన్ కె.రామ్మోహనరావు, జేఎన్టీయూకే ఇన్‌చార్జి వీసీ కేవీఎస్‌జీ మురళీకృష్ణ అందజేశారు. ప్రిన్సిపాల్‌ను కళాశాల చైర్మన్ డాక్టర్ పరుచూరి కృష్ణారావు, కార్యదర్శి, కరస్పాండెంట్ డాక్టర్ పి.చిరంజీవినీకుమారి, డైరెక్టర్ జీవీ కృష్ణంరాజు, ఏవో జీవీకే వర్మ, పీఆర్వో సాయిబాబు, అధ్యాపకులు అభినందించారు.

విద్యార్థులు అన్ని రంగాల్లో రాణించాలి

- ప్రముఖ సినీ నేపథ్య గాయకుడు శ్రీకృష్ణ
- ఘనంగా ముగిసిన శ్రీప్రకాష్ 48వ వ్యవస్థాపక దినోత్సవ వేడుకలు

తుని రూరల్, ఆగస్టు 20: విద్యార్థులు అన్ని రంగాల్లో రాణించడానికి కృషి చేయాలని ప్రముఖ సినీ నేపథ్య గాయకుడు శ్రీకృష్ణ కోరారు. మంగళవారం జరిగిన శ్రీప్రకాష్ విద్యా సంస్థల 48వ వ్యవస్థాపక దినోత్సవ వేడుకల ముగింపు సభలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. కేవలం విద్యే కాకుండా విద్యార్థుల్లో దాగి ఉన్న నైపుణ్యాలను వెలికితీసేందుకు ఇటువంటి కార్యక్రమాలు ఎంతగానో దోహదపడతాయన్నారు. వేటూరి సుందరరామమూర్తి, సంగీత దర్శకుడు ఆర్‌డీ బర్మన్ పాటలను ఎంపిక చేసుకోవడం ఈ కార్యక్రమానికి ఎంతో వన్నె తెచ్చిందన్నారు. ఈ పోటీల్లో విద్యార్థులు చక్కని ప్రతిభ కనబరిచారని, నిత్య సాధన చేస్తే వీరంతా భవిష్యత్తులో మంచి గాయకులుగా రాణించగలరనడంలో అతిశయోక్తి లేదన్నారు. అనంతరం శ్రీకృష్ణ తన పాటలతో ఆహూతులను ఉర్రూతలూగించారు. మరో అతిథి, ప్రముఖ కీబోర్డు ప్లేయర్ రవిశేఖర్ కీబోర్డుపై పలు పాటలు వాయించి అలరించారు. అనంతరం అతిథులు శ్రీకృష్ణ, రవిశేఖర్‌లకు శ్రీప్రకాష్ విద్యా సంస్థల సంయుక్త కార్యదర్శి సీహెచ్ విజయ్‌ప్రకాష్ జ్ఞాపికలు అందజేసి ఘనంగా సత్కరించారు. జూనియర్స్, సీనియర్స్ విభాగాల్లో నిర్వహించిన 'గాతా రహే మేరా దిల్' పోటీలో విజేతలకు బహుమతులు, ప్రశంసాపత్రాలు అందజేశారు. కార్యక్రమంలో శ్రీప్రకాష్ విద్యా సంస్థల అధినేత సీహెచ్‌వీకే నరసింహారావు, సీహెచ్ రామతులసి, ఏపీపీఎస్సీ సభ్యుడు సోనీవుడ్, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు, అధిక సంఖ్యలో విద్యార్థులు పాల్గొన్నారు.



'గాతా రహే మేరా దిల్' పోటీలో విజేతలతో శ్రీకృష్ణ, విజయ్‌ప్రకాష్



శ్రీకృష్ణకి జ్ఞాపిక అందజేస్తున్న శ్రీప్రకాష్ విద్యా సంస్థల సంయుక్త కార్యదర్శి విజయ్‌ప్రకాష్

మావోయిస్టు పార్టీ సభ్యుడు లొంగుబాటు

చింతూరు, ఆగస్టు 20: డాక్టర్ అల్లూరి సీతారామరాజు జిల్లా చింతూరు పోలీసులు ఎదుట మావోయిస్టు పార్టీ సభ్యుడు మడివిగంగ లొంగిపోయాడు. మంగళవారం ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఇందుకు సంబంధించిన వివరాలను చింతూరు ఏఎస్పీ పంకజ్‌కుమార్ మీనా వెల్లడించారు. మడివిగంగ ఛత్తీస్‌గఢ్ రాష్ట్రం సుక్మా జిల్లా బెజ్జి పోలీస్ స్టేషన్ పరిధిలోని రాంనగర్ గ్రామానికి చెందినవాడు. 2018లో నాటి కుంట ఏరియా మావోయిస్టు కమాండర్ సోడి గజేంద్ర ప్రోద్బలంతో మావోయిస్టు పార్టీ సానుభూతిపరుడిగా మారాడు. అప్పటి నుంచి 2020 వరకు కుంట ఏరియాలో మిలీషియా సభ్యుడిగా వ్యవహరించాడు. అనంతరం కుంట ఏరియా కమిటీ సభ్యురాలు సోడి మంజుల నేతృత్వంలో మావోయిస్టు పార్టీలో చేరాడు. 2021 నుంచి 2023 వరకు కుంట కమిటీ దళ సదాసిగా పని చేశాడు. 2024లో పార్టీ సభ్యుడిగా పదోన్నతి పొంది కుంట ఏరియా కమిటీలో కొనసాగాడు. పార్టీ ఆదేశాల మేరకు రెండు సార్లు పోలీసులపై కాల్పుల్లో పాల్గొన్నాడు. కాలక్రమంలో మావోయిస్టు విధానాలకు విసుగు చెందడంతో పాటు ప్రభుత్వం చేపట్టిన పునరావాస విధానాలు నచ్చి చివరకు పోలీసులు ఎదుట లొంగిపోయాడు. విలేకరుల సమావేశంలో సీఐ గజేంద్రకుమార్, ఎస్‌ఐ శ్రీనివాసరావు, సీఆర్పీఎఫ్ అసిస్టెంట్ కమాండర్ హేమంత్‌కుమార్, సిబ్బంది పాల్గొన్నారు.




లొంగిపోయిన మావోయిస్టు వివరాలు తెలుపుతున్న ఏఎస్పీ పంకజ్‌కుమార్ మీనా

కోనసీమ జిల్లా కలెక్టర్ ఫొటోతో

వాట్సాప్ డీపీ

- గుర్తు తెలియని వ్యక్తి సందేశాలు
- స్పందించవద్దని మహే‌ష్‌కుమార్ విజ్ఞప్తి

అమలాపురం, ఆగస్టు 20 (ఆంధ్రజ్యోతి): సాక్షాత్తు జిల్లా కలెక్టర్ ఫొటోనే వాట్సాప్ డీపీగా పెట్టి సందేశాలు పంపిస్తున్న అపరిచితుడి వ్యవహారాన్ని అధికారులు గుర్తించారు. సదరు వాట్సాప్ నుంచి వచ్చే సందేశాలకు ఎవ్వరూ స్పందించవద్దని ఆయన యంత్రాంగానికి, ప్రజలకు స్పష్టం చేశారు. వివరాల్లోకి వెళ్తే... డాక్టర్ బీఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా కలెక్టర్ ఆర్.మహేష్ కుమార్ ఫొటోను వాట్సాప్ డీపీగా పెట్టుకుని జిల్లాలోని అధికారులకు మెసేజ్‌లు పంపిస్తున్నారు. +94785566071 నెంబరుతో ఉన్న వాట్సాప్ ద్వారా అధికారులకు సందేశాలు అందుతున్నాయి. ఈ నెంబరును శ్రీలంక ఫోను నెంబరుగా గుర్తించారు. అయితే ఈ నెంబరు తనది కాదని, మెసేజ్‌లకు ఎవరూ స్పందించవద్దని, కాల్స్ కూడా స్వీకరించవద్దని కలెక్టర్ ఒక ప్రకటనలో విజ్ఞప్తి చేశారు.



ఇష్టం లేని పెళ్లి చేసుకున్నారని...

అబ్బాయి కుటుంబీకులపై అమ్మాయి తండ్రి దాడి

పి.గన్నవరం, ఆగస్టు 20: ఇష్టం లేని పెళ్లి చేసుకున్నారన్న నెపంతో యువ జంటతో పాటు వరుడు తల్లి, చెల్లెలుపై కుమార్తె తండ్రి దాడికి పాల్పడ్డ ఘటన కోడేరులంకలో మంగళవారం రాత్రి చోటుచేసుకుంది. బాధితులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా పి.గన్నవరం మండలం లంకల గన్నవరానికి చెందిన కొప్పాడి వరలక్ష్మి, ఆచంట మండలం కోడేరులంకకు చెందిన మెలా రమేష్ నాలుగు నెలలుగా ప్రేమించుకుంటున్నారు. ఇంట్లో పెద్దలు ఒప్పుకోకపోవడంతో ఈ నెల 18న చర్చిలో వివాహం చేసుకున్నారు. మంగళవారం ఉదయం వారు పోలీసులను ఆశ్రయించారు. ఇద్దరూ మేజర్లు కావడంతో ఎస్‌ఐ బి.శివకృష్ణ ఇరుపక్షాల పెద్దలతో మాట్లాడి పంపించివేశారు. రాత్రి సమయంలో వధువు తండ్రి కొప్పాడి వెంకటరమణ వరుడి ఇంటికి వెళ్లి అప్పుడే ఒప్పంద పత్రాలు రాసుకునే పని పూర్తి చేసుకుని ఇంటికి వచ్చిన యువ జంటతో పాటు వరుడి తల్లి, సోదరిలపై దాడికి పాల్పడ్డాడు. మాట్లాడే పనివుందని వారిని గదిలోకి పిలిచి తన బొడ్డులో ఉన్న చాకుతో కుమార్తె వరలక్ష్మిని బొటన వేళ్లపై, వరుడు రమేష్‌ను కుడి ఛాతీపై, తల్లి పద్మను వేళ్లపై, సోదరి ఈశ్వరిని బొటన వేలిపై గాయపరిచాడు. క్షతగాత్రులను పి.గన్నవరం సీహెచ్‌సీకి తరలించగా వైద్యులు పోలీసులకు సమాచారం అందించి చికిత్స చేయించారు. వధువు వరలక్ష్మి చేతి వేళ్లకు బలమైన గాయం కావడంతో మెరుగైన చికిత్స కోసం అమలాపురం తీసుకెళ్లాలని వైద్యులు సూచించారని కుటుంబసభ్యులు తెలిపారు. పోలీసులు ఆసుపత్రికి వచ్చి వివరాలు సేకరించారు. దాడి జరిగిన ప్రదేశం పశ్చిమ గోదావరి జిల్లా ఆచంట మండలం కోడేరు కావడంతో ఆ మండల పోలీసులకు ఇక్కడి పోలీసులు వివరాలు పంపనున్నట్టు తెలిసింది.



గాయాలపాలైన వధువు వరలక్ష్మి, వరుడు రమేష్



గుర్తు తెలియని వాహనం ఢీకొని వ్యక్తికి తీవ్ర గాయాలు

జగ్గంపేట, ఆగస్టు 20: గుర్తు తెలియని వాహనం ఢీకొని వ్యక్తికి తీవ్ర గాయాలయ్యాయి. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.... కాకినాడ జిల్లా జగ్గంపేటలోని జేవీఆర్ కాంప్లెక్స్ దాటిన తర్వాత రాజస్థాన్ దాబా వద్ద విశాఖపట్నం వెళ్లే జాతీయ రహదారిపై పల్సర్ మోటారు సైకిలుపై వెళ్తున్న కిర్లంపూడి మండలం బూరుగుపూడి గ్రామానికి చెందిన వ్యక్తిని వెనుక నుంచి లారీ ఢీకొంది. శరీరానికి తీవ్ర గాయాలు కావడంతో పాటు తలకు బలమైన గాయమైంది. క్షతగాత్రుడిని జగ్గంపేట పోలీసులు స్థానిక ప్రభుత్వాసుపత్రికి తరలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.



భూ సేకరణ కార్యాలయానికి వస్తున్న రైతులు, వారిని అడ్డుకుంటున్న పోలీసులు (ఇన్‌సెట్‌లో)

పోలవరం ప్రాజెక్టు కోసం

భూములు కోల్పోయాం

- వైసీపీ నాయకుల వల్ల నష్టపరిహారం రాలేదు
- మా భూములకు వైసీపీ నాయకులు దొంగ పట్టాలు సృష్టించారు
- అధికారులతో కుమ్మక్కై నష్టపరిహారం కాజేశారు
- పోలవరం భూసేకరణ కార్యాలయానికి తరలివచ్చి ఆందోళన చేసిన గిరిజన, గిరిజనేతర రైతులు

ధవళేశ్వరం, ఆగస్టు 20: పోలవరం ప్రాజెక్టు భూసేకరణలో భూములు కోల్పోయిన తమకు ప్రభుత్వం నుంచి నష్టపరిహారం అందలేదని గిరిజన, గిరిజనేతర రైతులు మంగళవారం ఉదయం తూర్పు గోదావరి జిల్లా ధవళేశ్వరంలోని పోలవరం భూ సేకరణ కార్యాలయానికి చేరుకుని ఆందోళన వ్యక్తం చేశారు. కార్యాలయంలో ఫైల్స్ దగ్ధంపై విచారణ జరుగుతున్న నేపథ్యంలో అధికారులను కలవడానికి వచ్చిన రైతులను పోలీసులు అడ్డుకున్నారు. అనంతరం అందరినీ రైతులుగా గుర్తించి కార్యాలయంలోకి అనుమతించారు. కార్యాలయంలో స్పెషల్ కలెక్టర్ సరళ వందనంను కలిసి వారు తమ గోడు వెళ్లబోసుకున్నారు. తమ నష్టపరిహారానికి సంబంధించిన పత్రాలపై ఆరా తీశారు. ఈ సందర్భంగా స్పెషల్ కలెక్టర్ మాట్లాడుతూ భూములిచ్చిన రైతుల పత్రాలు, ఫైల్స్ భద్రంగానే ఉన్నాయని, త్వరలోనే న్యాయం జరుగుతుందని హామీ ఇచ్చారు.

అల్లూరి సీతారామరాజు జిల్లా దేవీపట్నం మండలం చినరమణయ్యపేట, గుబ్బలపాలెం గ్రామాలకు చెందిన గిరిజన, గిరిజనేతర రైతులు డి.శాంతమ్మ, ముళ్ళ సీతాయమ్మ, ముళ్ళ కృష్ణారెడ్డి, పాయం వీరపుదొర, మట్టా రామమూర్తి, మెహర్‌బాబు గౌడ్ తదితర భూములు కోల్పోయిన రైతులు పోలవరం కార్యాలయంలో ఫైల్స్ దగ్ధం సమాచారంతో తమ వద్ద ఉన్న ఆధారాలతో పోలవరం కార్యాలయానికి చేరుకున్నారు. అధికారులను కలిసి తమకు న్యాయం చేయాలని కోరుకున్నారు. ఈ సందర్భంగా రైతులు మాట్లాడుతూ కోల్పోయిన భూములకు ఎకరాకు రూ.7.50 లక్షలు చొప్పున ప్రభుత్వం నష్టపరిహారం ప్రకటించిందన్నారు. వైసీపీ నాయకులు, సంబంధిత అధికారులు, దళారులు కుమ్మక్కై తమ భూములకు దొంగ డి-పట్టాలు సృష్టించి తమకు అందాల్సిన పరిహారం కాజేశారన్నారు. రెండు సంవత్సరాలుగా ఐటీడీఏ, పోలవరం భూ సేకరణ అధికారులు, పోలీస్ స్టేషన్ల చుట్టూ తిరిగినా ఇంతవరకూ న్యాయం జరగలేదని ఆవేదన చెందారు. భూములు కోల్పోయి, నష్టపరిహారం మరొకరు కాజేయడంతో మనోవేదనతో పలువురు కుటుంబ పెద్దలు మృతి చెందారని వాపోయారు. దొంగ డి-పట్టాలు సృష్టించి పరిహార సొమ్ములు కాజేసిన వైసీపీ నాయకులకు వత్తాసు పలుకుతూ అప్పటి అధికారులు తమపై బెదిరింపులకు పాల్పడ్డారన్నారు. రాజీకి వస్తే కొంత భూమికైనా నష్టపరిహారం అందుతుందని అధికారులే బెదిరిస్తే తాము ఏమి చేయగలమన్నారు. దొంగ డి- పట్టాలు సృష్టించి సొమ్ములు కాజేసిన విషయమై తమ ఫిర్యాదులపై విచారణ పూర్తిచేసి అసలైన లబ్ధిదారులకు పరిహారం అందజేయాలని సూచించినా ఇంతవరకు కార్యరూపం దాల్చలేదన్నారు. రెండు సంవత్సరాలుగా ఈ ఫైల్స్, విచారణ రిపోర్టులు పోలవరం భూసేకరణ కార్యాలయంలోనే ఉన్నాయన్నారు. అధికారులు స్పందించి తమకు న్యాయం జరిగే విధంగా చర్యలు తీసుకోవాలని కోరారు.

మా భూముల నష్టపరిహారాన్ని దొంగ పట్టాలతో కాజేశారు

డి.శాంతమ్మ, గుబ్బలపాలెం



పోలవరం భూ సేకరణలో మా కుటుంబ సభ్యులకు చెందిన 21ఎకరాల 20సెంట్ల భూమి పోయింది. ఇంతవరకు పరిహారం అందలేదు. దేవీపట్నం మండలం రమణయ్యపేటకు చెందిన వైసీపీ నాయకులు దొంగ పట్టాలు తయారు చేసి అధికారులతో కలిసి మాకు రావాల్సిన నష్టపరిహారం కాజేశారు. అప్పట్నుంచీ అధికారుల చుట్టూ తిరుగుతున్నాం. ఇంతవరకు న్యాయం జరగలేదు.

అధికారుల చుట్టూ తిరుగుతూ నా భర్త కన్నుమూశాడు

ముళ్ళ సీతాయమ్మ, గుబ్బలపాలెం



పోలవరం భూ సేకరణలో కోల్పోయిన భూములకు నష్టపరిహారం మాకు అందకుండా కొందరు దొంగ డి-పట్టాలతో కాజేశారు. ఆ సొమ్ముల కోసం అధికారులు చుట్టూ తిరుగుతూ బెంగతోనే నా భర్త కన్నుమూశాడు. అప్పట్నుంచీ నేను, నా కుమారుడు అధికారుల చుట్టూ తిరుగుతున్నాం. ఇంత వరకు పరిహారం రాలేదు.

నష్టపరిహారం అందకపోతే ఆత్మహత్యే శరణ్యం

పాయం వీరపుదొర, గుబ్బలపాలెం



పది ఎకరాల సాగు భూమి కోల్పోయాం. నష్టపరిహారం అందలేదు. భూమినే నమ్ముకుని బతికేవాళ్లం. పరిహారం అందించాలని రెండు సంవత్సరాలుగా అధికారులు చుట్టూ తిరుగుతూనే ఉన్నాం. న్యాయం జరగకపోతే ఆత్మహత్యే శరణ్యం.

ఐదెకరాల పరిహారం కాజేశారు

మట్టా రమణమూర్తి, చినరమణయ్యపేట

10 ఎకరాలకు నష్టపరిహారం రావాలి. దీంట్లో ఐదెకరాలకు వైసీపీ నాయకులు అధికారుల సహకారంతో దొంగ డి-పట్టాలు సృష్టించి పరిహారం కాజేశారు. వైసీపీ నాయకులతో రాజీపడితేనే మిగిలిన భూమికి నష్టపరిహారం చెల్లిస్తామని అప్పట్లో పోలవరం భూ సేకరణ కార్యాలయంలో పని చేసిన అధికారి బెదిరించారు.

వైసీపీ నాయకులు, అధికారులు చేసిన తప్పిదాలకు మేం కష్టాలు అనుభవిస్తున్నాం

మెహర్‌బాబా గౌడ్, చినరమణయ్యపేట

10 ఎకరాల భూమితో పాటు ఇల్లు కోల్పోయినందుకు నష్టపరిహారం రావాల్సి ఉంది. గత ప్రభుత్వంలో వైసీపీ నాయకులు, దళారులకు అధికారులు కొమ్ముకాయడంతో నాకు రావాల్సిన నష్టపరిహారాన్ని కొందరు కాజేశారు. అప్పటి నుంచీ భూసేకరణ కార్యాలయం చుట్టూ తిరుగుతూనే ఉన్నాం. అప్పట్లో పని చేసిన భూ సేకరణ స్పెషల్ కలెక్టర్ ప్రవీణ్ ఆదిత్యకు విన్నవించాం. అల్లూరి సీతారామరాజు జిల్లా కలెక్టర్‌గా పనిచేసిన సుమిత్‌కుమార్ గాంధీ మాకు న్యాయం చేయడానికి ఆయన వంతు ప్రయత్నాలు చేశారు. అయినా మాకు రావాల్సిన నష్టపరిహారం ఇంకా అందలేదు.



నష్టపరిహారం కోసం విన్నవించడానికి వచ్చిన చిన రమణయ్యపేట గ్రామ రైతులు

అన్నదాన భవన నిర్మాణానికి రూ.51,116 విరాళం

ఆత్రేయపురం, ఆగస్టు 20: కోనసీమ తిరుమల వాడపల్లి శ్రీవేంకటేశ్వర స్వామి ఆలయంలో నిర్మిస్తున్న వకుళమాత అన్నదాన భవన నిర్మాణానికి ఏలూరు జిల్లా గౌరవరానికి చెందిన కలగర రత్నసంపత్- సమత దంపతులు రూ.51,116విరాళం సమర్పించారు. దాతలకు స్వామివారి చిత్రపటం అందజేశారు. మంగళవారం వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు దర్శించుకున్నారు. వివిధ సేవల ద్వారా ఒక్కరోజు ఆదాయం రూ.1,59,559 లభించినట్టు ఉప కమిషనరు, ఈవో భూపతిరాజు కిశోర్‌కుమార్ తెలిపారు.

పర్యావరణ పరిరక్షణకు పాటుపడాలి

రామచంద్రపురం(ద్రాక్షారామ), ఆగస్టు 20: స్వయంశక్తి సంఘాల మహిళలు పర్యావరణ పరిరక్షణకు పాటుపడాలని మున్సిపల్ చీఫ్ విప్, కౌన్సిలరు వాడ్రేవుసాయి ప్రసాద్ అన్నారు. మంగళవారం 23వ వార్డు స్వయంశక్తి సంఘాల మహిళలకు మెప్మా ఆధ్వర్యంలో 10వ సచివాలయంలో జరిగిన సమావేశంలో ఆయనమాట్లాడారు. టౌన్‌మిషన్ కోఆర్డినేటర్ మంగాదేవి మాట్లాడుతూ సంఘల బలోపేతానికి పలు సూచనలు చేశారు. సీవో మహాలక్ష్మి, రిసోర్సు పర్సన్ భవానీ, మహిళలు పాల్గొన్నారు.

రోడ్లు, అభివృద్ధి పనులపై సమీక్ష

అల్లవరం, ఆగస్టు 20: మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీడీవో కృష్ణమోహన్ అధ్యక్షతన అభివృద్ధి పనులపై మంగళవారం సమీక్ష జరిగింది. ఉపాధి హామీ పథకంలో చేపట్టే పనులు, అంగన్‌వాడీ, తుఫాన్ షెల్టర్లు, రోడ్ల నిర్మాణాల అంశాలపై చర్చించారు. కార్యక్రమంలో పీఆర్ ఏఈ సంపన్, తాగునీటి శాఖ ఏఈ స్వామి, ఈవోపీఆర్డీ ఎన్వీవీ సత్యనారాయణ, ఏపీవో శ్రీనుబాబు, ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు తదితరులు పాల్గొన్నారు.

ఎస్సీ వర్గీకరణకు వ్యతిరేకంగా నేడు దేశ వ్యాప్త బంద్‌ను జయప్రదం చేయండి

అమలాపురంటౌన్, ఆగస్టు20: దళితుల ఐక్యతను దెబ్బతీసే విధంగా, దళిత బహుజనుల రిజర్వేషన్లను ఎత్తివేసేకుట్రలు చేస్తూ సుప్రీంకోర్టు ఇచ్చిన ఎస్సీ వర్గీకరణ తీర్పునకు వ్యతిరేకంగా దళిత ఐక్యవేదిక, వర్గీకరణ వ్యతిరేక, పోరాట సమితి సమావేశం జంగా బాబురావు అధ్యక్షతన మంగళవారం జరిగింది. వర్గీకరణకు వ్యతిరేకంగా బుధవారం దేశవ్యాప్తంగా చేపట్టిన బంద్‌ను విజయవంతం చేయాలని వక్తలు పిలుపునిచ్చారు. విద్యాసంస్థలు, వాణిజ్య సంస్థలు సహకరించాలని కోరారు. నాయకులు డీబీ లోక్, ఇసుకపట్ల రఘుబాబు, గెడ్డం సురేష్‌బాబు, కోట రామ్మోహనరావు, ములపర్తి సత్యనారాయణ, రేవు తిరుపతిరావు, పొలమూరి మోహన్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

అంబాజీపేట: ఎస్సీ వర్గీకరణకు సుప్రీంకోర్టు తీర్పును నిరసిస్తూ బుధవారం నిర్వహించే బంద్‌ను విజయవంతం చేయాలని మాలమహానాడు నాయకులు కోరారు. ప్రభుత్వ, ప్రైవేట్ కార్యాలయాలు, విద్యాసంస్థలు, బ్యాంకులు, వ్యాపార సంస్థలు, హోటల్స్ మూసివేయాలని వారు కోరారు.

మామిడికుదురు: ఎస్సీవర్గీకరణపై సుప్రీం కోర్టు తీర్పును నిరసిస్తూ మాలల న్యాయపోరాట సమితి బుధవారం తలపెట్టిన భారత్‌బంద్‌ను విజయవంతం చేయాలని పోరాట సమితి జిల్లా అధ్యక్షుడు బొంతు మణిరాజు కోరారు. బంద్‌కు సంబంధించిన కరపత్రాలను గ్రామాల్లో పంపిణీ చేసి బంద్‌కు సహకరించాలని మంగళవారం కోరారు. నల్లి శ్రీనివాస్, కలిగితి పళ్లంరాజు, బత్తుల జనార్ధన్, కుసుమ పెరుమాళ్ల కుమార్ తదితరులు పాల్గొన్నారు.

నేలకు అనువైన పంటలను సాగు చేసుకోవాలి

అయినవిల్లి, ఆగస్టు 20: నేలకు అనువైన పంటలను సాగు చేయాలని ఆత్మ పీడీ వై.జ్యోతి రైతులకు పిలుపు నిచ్చారు. సిరిపల్లిలో మంగళవారం ఆత్మ సౌజన్యంతో ప్రకృతి వ్యవసాయం, వాతావరణంలో వచ్చే మార్పులు, ఎరువుల వినియోగంపై రైతులకు శిక్షణ కార్యక్రమం జరిగింది. ఈసందర్భంగా పీడీ మాట్లాడుతూ నేలకు అనుగుణంగాఉండే పంటలను వేసుకోవాలన్నారు. జిల్లా వనరుల కేంద్రం సహాయ సంచాలకులు రాజశేఖర్ ఎరువుల యాజమాన్యం, తెగుళ్లు, పురుగు మందులు వినియోగంపై వివరించారు. మండల వ్యవసాయాధికారి, రైతులు పాల్గొన్నారు.

లాకుల వద్ద రైతుల ఆందోళన



ఉప్పలగుప్తం, ఆగస్టు 20: అమలాపురం- చల్లపల్లి ప్రధాన పంటకాల్వ శివారు వైరుపేట వద్ద లాకు తలుపు దెబ్బతినడంతో సాగునీరు వృథాగా డ్రెయిన్‌లోకి పోతోంది. దెబ్బతిన్న తలుపు స్థానంలో కొత్తది ఏర్పాటు చేయాలని చాలా కాలంగా రైతులు అభ్యర్థిస్తున్నారు. ఫలితం లేకపోవడంతో మంగళవారం రైతులు లాకు వద్ద నిరసన ప్రదర్శన నిర్వహించారు. లాకు తలుప ఏర్పాటు చేయాలన్నారు. పోలిశెట్టి శివాజీ, దంగేటి బాబులు, భోగిశెట్టి నర్సింగ్ ఆధ్వర్యంలో కార్యక్రమం జరిగింది.

వైద్య విద్యార్థిని ఘటనలో దోషులను శిక్షించాలి

యానాం, ముమ్మిడివరం, మండపేటలలో ర్యాలీ

యానాం, ఆగస్టు 20: కోల్‌కతాలో వైద్య విద్యార్థినిపై జరిగిన అత్యాచార ఘటనలో దోషులను కఠినంగా శిక్షించాలని యానాం జిప్మెర్ వైద్య బృందం డిమాండ్ చేసింది. స్థానిక ప్రభుత్వాసుపత్రి వద్ద నుంచి కొవ్వొత్తులతో ర్యాలీ నిర్వహించారు. ర్యాలీలో పుదుచ్చేరి ప్రభుత్వ ఢిల్లీ ప్రత్యేక ప్రతినిధి మల్లాడి కృష్ణారావు, యానాం జిప్మెర్ ప్రతినిధి ఆనంద్‌రాజ్ పాల్గొన్నారు. ఇటువంటి ఘటనలు పునరావృతం కాకుండా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వాసుపత్రి నుంచి ప్రారంభమైన ర్యాలీ విష్ణాలయం, చిన్నా సెంటర్, పాత బస్టాండ్, కొత్తబస్టాండ్, సుబ్రహ్మణ్యభారతి వీధి, చింతా వీధి మీదుగా జిప్మెర్ ఆసుపత్రికి చేరింది. అనంతరం పరిపాలనాధికారికి వినతిపత్రం అందజేశారు. ఎన్‌ఆర్ కాంగ్రెస్ యానాం శాఖ అధ్యక్షుడు మల్లాడి శామ్యూల్, పెండెం సూర్యప్రకాష్, గిడ్ల చంద్రరావు, జిప్మెర్, యానాం ప్రభుత్వాసుపత్రి సిబ్బంది పాల్గొన్నారు.

మండపేట: కోల్‌కతాలో వైద్య విద్యార్థినిపై అత్యాచారం, హత్య ఘటనలో నిందితులను కఠినంగా శిక్షించాలని కోరుతూ వెలగతోడు జడ్పీ హైస్కూల్ విద్యార్థులు మంగళవారం ర్యాలీ నిర్వహించారు.వెలగతోడు పాఠశాల హెచ్ఎం లక్ష్మీనారాయణ, ఇన్‌చార్జి హెచ్ఎం ఎస్.శ్రీనివా సరావు ఆధ్వర్యంలో జరిగిన ర్యాలీలో విద్యార్థులు, సచివా లయ సిబ్బంది, వైద్య ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

ముమ్మిడివరం: కోల్‌కతాలో పీజీ వైద్య విద్యార్థినిపై జరిగిన అత్యాచారం, హత్యను నిరసిస్తూ ముమ్మిడివరంలో మంగళవారం ప్రభుత్వ డిగ్రీ కళాశాల విద్యార్థులు నిరసన కార్యక్రమం చేపట్టారు. బాధిత కుటుంబానికి న్యాయం చేయాలని, నిందితులను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. కళాశాల నుంచి తహశీల్దార్ కార్యాల యం వరకు ర్యాలీ నిర్వహించారు. డాక్టర్ ప్రభాకర్, అధ్యాపకులు చిట్టిబాబు, విజయకుమార్, లీలావతి, విద్యార్థులు పాల్గొన్నారు.

మామిడికుదురు: పీజీ వైద్య విద్యార్థినిపై జరిగిన అఘాయిత్యాన్ని నిరసిస్తూ ఈదరాడ హైస్కూల్ విద్యార్థులు చిత్రాలు గీచి నిరసన తెలిపారు. మహిళలపై జరుగుతున్న అఘాయిత్యాలను 8,10తరగతుల విద్యార్థులు కళ్లకు కట్టినట్లు చిత్రీకరించి అబ్బురపరిచారు. ఈకేసులో దోషులను శిక్షించాలని డిమాండ్ చేశారు. డ్రాయింగ్ ఉపాధ్యాయుడు బత్తుల శ్రీనివాస్ ఆధ్వర్యంలో చిత్రాల ప్రదర్శన జరిగింది.





యానాం:కొవ్వొత్తుల ర్యాలీలో పాల్గొన్న ఢిల్లీ ప్రతినిధి మల్లాడి, జిప్మెర్ అధికారులు, ముమ్మిడివరంలో ర్యాలీ నిర్వహిస్తున్న విద్యార్థులు

మెగాస్టార్ చిరంజీవి జన్మదిన వారోత్సవాలు

అమలాపురంటౌన్, ఆగస్టు 20: మెగాస్టార్ చిరంజీవి జన్మదిన వారోత్సవాల్లో భాగంగా 3వ రోజు అమలాపురం లూయి అంధుల పాఠశాలలో మెగా ఫ్యాన్స్ ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. తొలుత విద్యార్థుల సమక్షంలో చిరంజీవి జన్మదిన వేడుకల కేక్‌ను చిరంజీవి యువత ఉపాధ్యక్షుడు నల్లా చిట్టిబాబు, యేడిద శ్రీను ఆధ్వర్యంలో కట్ చేశారు. కార్యక్రమంలో మెగా అభిమానులు నల్లా నాయుడు, వడ్రే శేషు, దాట్ల బాబు, నిమ్మకాయల రాంబాబు, ఆచంట శ్రీను తదితరులు పాల్గొన్నారు.

సన్నద్ధత ప్రక్రియను పరిశీలించిన డీఈవో

ఉప్పలగుప్తం, ఆగస్టు20: గొల్లవిల్లి హైస్కూల్లో మంగళవారం 8,9 తరగతుల విద్యార్థులకు సీబీఎస్ఈ ఆన్‌లైన్ పరీక్షల సన్నద్ధత కార్యక్రమం జరిగింది. జిల్లా విద్యాశాఖాధికారి ఎం.కమలకుమారి సన్నద్ధత కార్యక్రమాన్ని పరిశీలించారు. వారం రోజులుగా ట్యాబ్‌ల పనితీరును పరిశీలించి, పరీక్షకు సిద్ధం చేసినట్టు హెచ్ఎం లంక రాణి డీఈవోకు వివరించారు. డీఈవో మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించారు.ఎంఈవో సత్తి సత్యకృష్ణ పాల్గొన్నారు.

పేకాట శిబిరంపై దాడి

ఆత్రేయపురం, ఆగస్టు 20: ఆత్రేయపురంలో పేకాట ఆడుతున్నారన్న సమాచారం మేరకు సీఐ విద్యాసాగర్ ఆధ్వర్యంలో ఎస్ఐ శ్రీనివాసు సిబ్బందితో కలిసి దాడి నిర్వహించారు. ఆరుగురి వ్యక్తులను అదుపులోకి తీసుకుని వారి వద్ద నుంచి రూ.40,800 స్వాధీనం చేసుకున్నారు. కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

ఘనంగా పోలమ్మ అమ్మవారి ఆవిర్భావ పూజలు



రాయవరం, ఆగస్టు 20: వెలమ కులస్తుల ఆరాధ్యదైవం, రాయవరంలో వెలసిన శ్రీపోలమ్మ అమ్మవారి ఆవిర్భావ వేడుకలు మంగళవారం నిర్వ హించారు. 200ఏళ్ల క్రితం విజయనగరం జిల్లా వసంత గ్రామం నుంచి వలస కూలీలతో అమ్మవారు రాయవరం వచ్చి గ్రామంలో వెలసిందని గ్రామస్థులు చెబుతారు. శ్రావణమాసం మూడో మంగళవారం రోజున అమ్మవారు వెలసిన సందర్భంగా ఆవిర్భావ దినోత్సవ పూజలు పోలమ్మ ఆలయ కమిటీ అధ్యక్షుడు, ఎంపీపీ నౌడు వెంకటరమణ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. వేకువజాము నుంచి అమ్మవారికి ప్రత్యేక అభిషేకాలు, కుంకుమ పూజలు, విష్ణుసహస్రనామ పారాయణ, భగవద్గీత 18 అధ్యాయాల పారాయణలు, అమ్మవారికి ఏకాహ భజనలు నిర్వహించారు. అనంతరం అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తులు అమ్మవార్ని దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు.

సేవా రంగంలో చిరంజీవి భేష్

రాజోలు, ఆగస్టు 21: సేవా రంగంలో మెగాస్టార్ చిరంజీవి ఉన్నత శిఖరాలను అధిరోహించారని రాజోలు ఎమ్మెల్యే దేవ వరప్రసాద్ అన్నారు. చిరంజీవి జన్మదిన వారోత్సవాల్లో భాగంగా రాజోలు ఏరియా ఆసుపత్రిలో చిరుపవన్ సేవాసమితి ఆధ్వర్యంలో మంగళవారం ఏర్పాటుచేసిన రక్తదాన శిబిరాన్ని ఆయన ప్రారంభించారు సెప్టెంబరు 2న ఆసుపత్రిలో డయాలసిస్ సెంటర్‌ను ప్రారంభిస్తామన్నారు. ఆయన కేక్ కట్ చేసి రోగులకు పండ్లు పంపిణీ చేశారు. రక్తదానం చేసిన 25మందిని ఆయన అభినందించారు. కార్యక్రమంలో గుండాబత్తుల తాతాజీ, గుబ్బల ఫణికుమార్, సూరిశెట్టి శ్రీనివాస్, గుండుమోగుల పెద్దకాపు, ఉండవల్లి అంజి, కుంపట్ల చిన్నారి, సర్పంచ్ రేవు జ్యోతి, మట్టపర్తి లక్ష్మి, మోకా పార్వతి, కె.రాజు, పినిశెట్టి బుజ్జిపాల్గొన్నారు.

ఎంపీ హరీష్‌కు సత్కారం

అమలాపురం టౌన్, ఆగస్టు 20: అమలాపురం పార్లమెంట్ సభ్యుడు హరీష్‌మాధుర్‌ను ఆధ్యాత్మిక వేత్త రేలంగి కుమార్‌శంకర్‌గౌడ్ అధ్వర్యంలో మంగళవారం ఘనంగా సత్కరించారు. అనంతరం కుమార్‌శంకర్‌గౌడ్ రాసిన ఆధ్యాత్మిక పుస్తకాన్ని బహూకరించారు. కార్యక్రమంలో అయినవిల్లి నాగేంద్రకుమార్‌గౌడ్, ఐవి.రామకృష్ణ, ఈరి ప్రసాద్, నార్గన శ్రీను, రేలంగి మధు, కనకలింగేశ్వరరావు, శ్రీకాంత్, మార్గాన నాగేంద్ర తదితరులు పాల్గొన్నారు.

రాజీవ్ ఆశయ సాధనకు కృషి చేయాలి



అంబాజీపేటలో రాజీవ్‌కు నివాళులర్పిస్తున్న కాంగ్రెస్ నాయకులు

ఘనంగా మాజీ ప్రధాని రాజీవ్‌గాంధీ జయంతి

అమలాపురంటౌన్, ఆగస్టు20: స్థానిక సంస్థలకు రాజ్యాంగ బద్ధమైన హక్కులు, విధులు కల్పించడంతో పాటు ఢిల్లీ నుంచి గల్లీ వరకు జనాభా ఆధారంగా నిధులు విడుదల చేసిన ఘనత మాజీ ప్రధాని రాజీవ్ గాంధీకే దక్కుతుందని ఏఐసీసీ వర్కింగ్ కమిటీ సభ్యుడు గిడుగు రుద్రరాజు అన్నారు. బండారులంకలోని కాంగ్రెస్ పార్టీ జిల్లా కార్యాలయం వద్ద జిల్లా పార్టీ అధ్యక్షుడు కామన ప్రభాకరరావు అధ్యక్షతన రాజీవ్‌గాంధీ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. రుద్రరాజుతో పాటు పలువురు రాజీవ్ చిత్రపటానికి పూలమాలలువేసి నివాళులర్పించారు. రాజీవ్‌గాంధీ ఆశయ సాధనకు కృషి చేయాలన్నారు. అనంతరం కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు రక్తదాన శిబిరం నిర్వహించారు. కార్యక్రమంలో సుగ్గు ప్రసాద్, వస్కా బాబు, అప్పన సాయి, రౌతు ఈశ్వరరావు, మాచవరపు శివన్నారాయణ, అయితాబత్తుల కుమార్‌సింగ్, కొత్తూరి శ్రీను, షకీలా తదితరులు పాల్గొన్నారు. అమలాపురం నల్లవంతెన వద్ద రాజీవ్‌గాంధీ విగ్రహానికి నియోజకవర్గ ఇన్‌చార్జ్ అయితాబత్తుల సుభాషిణి, పట్టణశాఖ అధ్యక్షుడు వంటెద్దు బాబి ఆధ్వర్యంలో రుద్రరాజు పూలమాలలువేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో ముషిణి రామకృష్ణ, డి.విజయలక్ష్మి, కుడుపూడి శ్రీనివాస్, యార్లగడ్డ రవీంద్ర, వడ్డి నాగేశ్వరరావు, పేరి శర్మ పాల్గొన్నారు.

రామచంద్రపురం(ద్రాక్షారామ): మాజీ ప్రధాని రాజీవ్ గాంధీ జయంతిని కాంగ్రెస్ పార్టీ నాయకులు మంగళవారం ఘనంగా నిర్వహించారు. పార్టీ పట్టణ అధ్యక్షుడు ఆర్.డి.ఖాన్ ఆధ్వర్యంలో జరిగిన జయంతి కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి కోట శ్రీనివాసరావు, నాయకుడు మెహతాబ్ ఖరేషి, పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ముమ్మిడివరం: మాజీ ప్రధాని రాజీవ్‌గాంధీ జయంతిని ముమ్మిడివరం కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో మంగళవారం నిర్వహించారు. రాజీవ్ చిత్రపటానికి నేతలు పూలమాలలు వేసి నివాళులర్పించారు. పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు పి.ఉదయభాస్కరవర్మ నేతృత్వంలో పేదలకు రొట్టె, వాటర్‌బాటిళ్లు అందించారు. కార్యకర్తలు, నాయకులు పాల్గొన్నారు.

పి.గన్నవరం: కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు చిట్టాల జోగేశ్వరరావు ఆధ్వర్యంలో పి.గన్నవరం అక్విడెక్టు వద్ద గల రాజీవ్‌గాంధీ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. తెగడ నరసింహమూర్తి, అన్నాబత్తుల సత్యనారాయణ, చిట్టాల ఆర్యశ్రీను, కొండేటి శ్రీను తదితరులు పాల్గొన్నారు.

మామిడికుదురు: మాజీ ప్రధాని రాజీవ్‌గాంధీకి కాంగ్రెస్ నాయకులు ఘన నివాళులర్పించారు. స్థానిక బస్టాండ్ కూడలిలో గల ఆయన విగ్రహానికి పూలమాలలువేసి నివాళులర్పించారు. అప్పన రామకృష్ణ, బత్తుల సురేష్‌బాబు, వారణాసి దొరబాబు, బొంతు రామకిషోర్ తదితరులు పాల్గొన్నారు.

అంబాజీపేట: మాజీ ప్రధాని రాజీవ్‌గాంధీ బాటలో పయనించాలని మాజీ ఎమ్మెల్యే, కాంగ్రెస్ పార్టీ నాయకుడు కొండేటి చిట్టిబాబు అన్నారు. స్థానిక బస్టాండ్ వద్ద ఉన్న ఆయన విగ్రహానికి పార్టీ నాయకులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. దేశానికి రాజీవ్ చేసిన సేవలు కొనియాడారు. కార్యక్రమంలో నాయకులు మహ్మద్ ఆరీఫ్, కొండేటి వెంకటేశ్వరరావు, మాచవరపు శివన్నారాయణ, మహ్మద్ ఇస్మాయిల్, నాగవరపు నాగరాజు, కొండేటి వికాస్, నేతల నాగరాజు, ఆదుర్తి నారాయణమూర్తి తదితరులు పాల్గొన్నారు.

యానాం: మాజీప్రధాని రాజీవ్‌గాంధీ జయంతిని సమాచారశాఖ ఆధ్వర్యంలో నిర్వహించారు. స్థానిక ఫెర్రీరోడ్డులో గల రాజీవ్ విగ్రహానికి యానాం పరిపాలనాధికారి మునిస్వామి, ఎస్పీ రాజశేఖరన్, మున్సిపల్ కమిషనర్ ఖండవల్లి రామకృష్ణ పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈసందర్భంగా సద్భావన్ దివాస్ ప్రతిజ్ఞ చేశారు. ఎస్ఐ మురుగానందం, సమాచార శాఖాధికారి కె.ఎల్.వి.ప్రసాద్, కార్యాలయ సూపరింటెండెంట్ కళ్ల సత్యనారాయణ పాల్గొన్నారు.

దోమల నిర్మూలనతోనే వ్యాధులకు చెక్



ఆలమూరు: పెదపళ్లలో దోమల నివారణ దినోత్సవ ర్యాలీ

ముమ్మిడివరం, ఆగస్టు 20: దోమల నిర్మూలనపై ముమ్మిడివరం అర్బన్ పీహెచ్‌సీ ఆధ్వర్యంలో మంగళవారం వైద్య సిబ్బంది ర్యాలీ నిర్వహించారు. వైద్యురాలు యోగితాలక్ష్మి సారధ్యంలో నిర్వహించిన ర్యాలీలో దోమల నిర్మూలనకు తీసుకోవల్సిన చర్యలు, దోమలు వల్ల వచ్చే వ్యాధులు గురించి వివరించారు. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని దోమల నిర్మూలనకు చర్యలు తీసుకోవాలని కోరారు. ఆసుపత్రి నుంచి స్థానిక తహసీల్దార్ కార్యాలయం వరకు ర్యాలీ నిర్వహించారు. వైద్య సిబ్బంది బి.సంపూర్ణ, సత్యన్నారాయణ పాల్గొన్నారు.

మామిడికుదురు: దోమల నిర్మూలనకు ప్రతీ ఒక్కరూ ముందుకు రావాలని లూటుకుర్రు పీహెచ్‌సీ వైద్యాధికారిణి జి.రమ్యశైలజ కోరారు. దోమల నిర్మూలనపై మగటపల్లి పంచాయతీ కార్యాలయంలో లూటుకుర్రు పీహెచ్‌సీ ఆధ్వర్యంలో అవగాహన సదస్సు నిర్వహించారు. కార్యక్రమంలో వైద్యాధికారిణి శైలజ మాట్లాడుతూ దోమలు ద్వారా వచ్చే వ్యాధులు గురించి, వాటి నిర్మూలనకు తీసుకోవల్సిన జాగ్రత్తలు గురించి వివరించారు.హెల్త్ అసిస్టెంట్ కె.ఉమామహేశ్వరరావు, ఎంఎల్‌హెచ్‌వి దివ్య, ఏఎన్ఎం రాజేశ్వరి, ఆశాలు పాల్గొన్నారు.

ఆత్రేయపురం: స్థానికపీహెచ్‌సీలో మంగళవారం ప్రపంచ దోమల నివారణ దినోత్సవం సందర్భంగా వైద్యాధికారి పి.సౌమ్య ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించారు. దోమలు పెరగకుండా జాగ్రత్తలు తీసుకోవాలని, మురుగునీరు నిల్వలేకుండా చూసుకోవడం, దోమల మందు పిచికారీపై అవగాహన కల్పించారు. సూపర్‌వైజర్ అరుణకుమారి, సీహెచ్‌వో చంటమ్మ, పీహెచ్ఎన్ సూర్యనారాయణ, విజయభాను, ఆరోగ్య సిబ్బంది ర్యాలీలో పాల్గొని ఇంటింటికి వెళ్లి అవగాహన కల్పించారు.

ఆలమూరు: వ్యాధులు ప్రబలడానికి దోమలే కారణమని, వాటిని సమర్థవంతంగా నివారిస్తే ఆరోగ్యవంతమైన జీవితం గడపడానికి వీలు కలుగుతుందని పలువురు వక్తలు అన్నారు. దోమల నివారణ దినోత్సవం సందర్భంగా పెదపళ్ల, చొప్పెల్ల పీహెచ్‌సీ వైద్యాధికారులు పి.భవానీశంకర్, సువర్చలానాయుడు అధ్వర్యంలో దోమల నివారణ ర్యాలీలు, అవగాహన సదస్సులు నిర్వహించారు. దోమలనివారణ ఆవశ్యకతను ప్రజలకు వివరించే విధంగా ర్యాలీ చేశారు. పెదపళ్ల, చొప్పెల్ల పీహెచ్‌సీ సిబ్బంది, అంగన్‌వాడీ కార్యకర్తలు, ఏఎన్ఎంలు పాల్గొన్నారు.

ఎంపీడీవోగా కీర్తి స్పందన

ద్రాక్షారామ, ఆగస్టు 20: రామచంద్రపురం ఎంపీడీవోగా ఎన్.కీర్తి స్పందన మంగళవారం బాధ్యతలు స్వీకరించారు. సార్వత్రిక ఎన్నికల ముందు ఆమె విశాఖ జిల్లాకు బదిలీపై వెళ్లారు. తిరిగి రామచంద్రపురం బదిలీపై వచ్చారు.

బంగారు వస్తువులు బహూకరణ

ఆత్రేయపురం, ఆగస్టు 20: ర్యాలి జగన్మోహిని కేశవస్వామి వారికి జిన్నూరి నాగేశ్వరరావు-పార్వతి దంపతులు 5వెండి యజ్ఞోపవీతం, అమ్మవారికి బంగారు మంగళసూత్రాలు బహుకరించినట్లు ఈవో కృష్ణచైతన్య తెలిపారు.

నేషనల్ మెరిట్‌స్కాలర్‌షిప్‌కు దరఖాస్తుల ఆహ్వానం

ముమ్మిడివరం, ఆగస్టు 20: నేషనల్ మీన్స్ కం మెరిట్‌స్కాలర్‌షిప్ పరీక్షలకు దరఖాస్తులు ఆన్‌లైన్, ప్రభుత్వ కార్యాలయాల్లో అందుబాటులో ఉంచినట్టు ప్రభుత్వ పరీక్షల నిర్వాహకులు నక్కా సురేష్‌కుమార్ చెప్పారు. 2024 డిసెంబరు 8న జరిగే పరీక్షకు పేర్లు నమోదు చేసుకునేందుకు సెప్టెంబరు 6వతేదీ ఆఖరు అన్నారు. విద్యార్థి ఆధార్‌కార్డులో ఉన్న విధంగా పుట్టిన తేదీ, తండ్రిపేరు నమోదు చేయాలన్నారు. రాష్ట్రంలోని ప్రభుత్వ జిల్లాపరిషత్, మండల పరిషత్, మున్సిపల్ ఎయిడెడ్, వసతి సౌకర్యంలేని ఆదర్శ పాఠశాలల్లో 8వతరగతి చదువుతూ ఏడాదికి కుటుంబానికి రూ3.5లక్షలు ఆదాయం మించకుండా ఉన్న విద్యార్థులు పరీక్ష రాసేందుకు అర్హులన్నారు. పరీక్షలు రాసేటప్పటికి అన్నిధ్రువీకరణ పత్రాలు సిద్ధం చేసుకోవాలన్నారు. ఓసీ, బీసీ విద్యార్థులు పరీక్ష రుసుం రూ.100, ఎస్సీఎస్టీ విద్యార్థులు రూ.50 చెల్లించాలన్నారు ఆన్‌లైన్‌లో ఇచ్చిన దరఖాస్తులో ఎస్‌బీఐ లింక్ ద్వారా ఫీజు చెల్లించాలన్నారు. సమాచారం కోసం ప్రభుత్వ పరీక్షల సంచాలకులు వెబ్‌సైట్, జిల్లా విద్యాశాఖాధికారి కార్యాలయంలో సంప్రదించాలన్నారు.

23న ఉపాధి హామీ గ్రామసభలు

కపిలేశ్వరపురం,ఆగస్టు20: మండలంలోని 19గ్రామాల్లోని పంచాయతీ కార్యాలయాల వద్ద ఈనెల23న ఉపాధిహామీ పనులు గుర్తించేందుకు గ్రామ సభలు నిర్వహిస్తున్నట్లు ఎంపీడీవో కొండలరావు తెలిపారు. అద్దంకివారి లంక, అంగర, కాలేరు, కపిలేశ్వరపురం, నల్లూరు,నేలటూరు, వడ్లమూరు, వాకతిప్ప గ్రామాల్లో ఉదయం పది గంటలకు, నిడసనమెట్ట, టేకి, తాతపూడి, వెదురుమూడి గ్రామాల్లో ఉదయం 11గంటలకు, కేదార్లంక, కోరుమిల్లి, నాగులచెరువు గ్రామాల్లో 11.30గంటలకు, మాచర, పడమరఖండ్రికలో మధ్యాహ్నం రెండు గంటలకు, వల్లూరులో 2.30గంటలకు, అచ్యుతాపురంలో 3గంటలకు నుంచి గ్రామసభలు నిర్వహిస్తామన్నారు.

ఓడలరేవు బీవీసీ కళాశాలకు పురస్కారం

అల్లవరం, ఆగస్టు20: కాకినాడ జేఎన్టీయూకే పరిధిలో అత్యుత్తమ విద్యాసంస్థగా ఓడలరేవు బీవీసీ ఇంజనీరింగ్ కళాశాల ఉత్తమ పురస్కారం అందుకుందని బీవీసీయాజమాన్యం తెలిపింది. కాకినా డలో జరిగిన జేఎన్టీయూకే 17వ ఆవిర్భావ దినోత్సవంలో జాతీయ విద్యావేత్తల సమక్షంలో ఏపీ రాష్ట్ర ఉన్నత విద్యామండలి అధ్యక్షుడు ప్రొఫెసర్ కె.రామ్మోహనరావు, విశ్వవిద్యాలయ ఉపకులపతి డాక్టర్ కేవీఎస్‌జీ మురళీకృష్ణ ద్వారా ప్రిన్సిపాల్ డాక్టర్ వీఎస్‌ఏ చంద్రమౌళి పురస్కారం అందుకున్నారు. 27ఏళ్ల నిర్విరామ సమష్టి కృషికి గుర్తింపుగా పురస్కారం లభించిందన్నారు. కళాశాల సెక్రటరీ బోనం కనకయ్య, చైర్మన్ బోనం కృష్ణసతీష్ అభినందనలు తెలిపారు.

సినిమా గైడ్

అమలాపురం

వెంకటరమణ	: మిస్టర్ బచ్చన్
శ్రీలలిత	: కమిటీ కుర్రోళ్లు
శేఖర్ స్ర్కీన్-1	: డబుల్ ఇస్మార్ట్
శేఖర్ స్ర్కీన్-2	: వేద
రమా	: ఆయ్
గణపతి	: రాయన్
వెంకటపద్మావతిస్ర్కీన్-1	: డబుల్ ఇస్మార్ట్
వెంకటపద్మావతి స్ర్కీన్-2	: తంగలాన్

డ్వాక్రా బ్యాంక్ ఖాతాలు మార్పు చేయాలని పీడీకి వినతి

ఆలమూరు, ఆగస్టు 20: జొన్నాడలోని డ్వాక్రా సంఘాల బ్యాంక్ అకౌంట్లను ఆలమూరు నుంచి జొన్నాడలోని యూనియన్ బ్యాంక్ బ్రాంచ్‌కు మార్పు చేయాలని కోరుతూ జొన్నాడ టీడీపీ నాయకులు మంగళవారం జిల్లా డీఆర్‌డీఏ పీడీ శివశంకర్‌ప్రసాద్‌కు వినతి పత్రం అందజేశారు. గ్రామానికి చెందిన మాజీ ఉపసర్పంచ్ తాడి శ్రీనివాసరెడ్డి, నాయకులు చింతలపూడి శ్రీనివాస్ అధ్వర్యంలో పీడీ శివశంకర్‌ప్రసాద్‌ను కలిసి వివరించారు. జొన్నాడలో ఉన్న డ్వాక్రా సంఘాలలో ఉన్న 1500మంది సభ్యులు బ్యాంక్ లావాదేవీల కోసం జొన్నాడ నుంచి ఆలమూరు రావాల్సి వస్తుందని అందువల్ల జొన్నాడలో ఏర్పాటుచేసిన యూనియన్ బ్యాంక్ బ్రాంచ్‌కు మార్పు చేయాలని కోరారు. బ్యాంక్ ఖాతాలు మార్పు చేయడం వల్ల డ్వాక్రా సంఘాల సభ్యులకు ఎంతో ప్రయోజనం కలుగుతుందని వారు వివరించారు.

ఘనంగా అంకురార్పణ పూజా మహోత్సవం

రావులపాలెం, ఆగస్టు20: రావులపాడు కాలువగట్టు చెంతన ఆంజనేయ స్వామి విగ్రహ ప్రతిష్ఠమహోత్సవాన్ని పురస్కరించుకునిఅంకురార్పణ పూజా కార్యక్రమం సోమవారం జరిగింది. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

నేడు మెగా జాబ్‌మేళా

రావులపాలెం, ఆగస్టు 20: రావులపాలెం సత్యసాయి కళాశాల ప్రాంగణంలో బుధవారం మెగాజాబ్‌మేళా నిర్వహిస్తున్నట్లు టీడీపీ యువ నాయకుడు బండారు సంజీవ్ మంగళవారం తెలిపారు. నియోజకవర్గ పరిధిలోని నిరుద్యోగులు జాబ్‌మేళాను సద్వినియోగం చేసుకోవాలన్నారు. పలు కంపెనీలకు చెందిన ప్రతినిధులు జాబ్‌మేళాకు హాజరవుతారన్నారు.

ఇసుక ట్రాక్టర్ సీజ్

ముమ్మిడివరం, ఆగస్టు 20: రాణేల్లంక గోదావరి నదీ పాయ నుంచి ఇసుకను అక్రమంగా తరలిస్తున్న ట్రాక్టర్‌ను ఎస్ఐ డి.జ్వాలాసాగర్ ఆధ్వర్యంలో పోలీసులు సీజ్ చేశారు. డ్రైవర్‌పై కేసు నమోదు చేసి, ట్రాక్టర్‌ను తహశీల్దార్ కోర్టులో హాజరుపర్చామన్నారు.

25న భారీ నిరసన ప్రదర్శన

అల్లవరం, ఆగస్టు 20: కోల్‌కతాలో వైద్య విద్యార్థిపై జరిగిన హత్యాచారాన్ని నిరసిస్తూ ఈనెల25న అమలాపురం హైస్కూల్ సెంటర్ నుంచి కిమ్స్ ఆసుపత్రి వరకు భారీ నిరసన ప్రదర్శన జరుగుతుందని నిర్వాహకుడు కొల్లు గౌతమ్ ఓ ప్రకటనలో తెలిపారు. దేశంలో జరుగుతున్న నేరాల చిత్రాలతో వంద అడుగుల ఫ్లెక్సీని ఏర్పాటు చేస్తామన్నారు.

ఎంఈవో హెలీనాకు ఘన సన్మానం

పి.గన్నవరం, ఆగస్టు 20: స్వాతంత్ర్య వేడుకల్లో జిల్లా ఉన్నతా ధికారుల నుంచి ఉత్తమ సేవా పురస్కారం అందుకున్న ఎంఈవో కె.హెలీనాను అప్పుస్మా రాజోలు డివిజన్ సభ్యులు ఆధ్వర్యంలో సభ్యులు దుశ్శాలువాతో ఘనంగా సన్మానించి అభినందనలు తెలిపారు. కార్యక్రమంలో అప్పుస్మా రాజోలు డివిజన్ అధ్యక్షుడు గోపి నాథ్, రాష్ట్ర ఉపాధ్యక్షుడు శ్రీరమణారావు, జిల్లా కార్యదర్శి అయ్యప్పనాయుడు, జిల్లా ట్రెజరర్ శ్రీనివాస్, డివిజన్ ట్రెజరీ కిరణ్ కుమార్, స్టేట్ సభ్యులు రామవేంద్రనాయుడు, రత్నంరాజు, డివిజన్ ఉపాధ్యక్షుడు సూరిబాబు, సూర్యనారాయణ, రహేలుబాబు, జిల్లా సభ్యులు మానస చిన్నా, గోపాలకృష్ణ, ప్రసాద్, మండల సభ్యులు అన్నాబత్తు అనుబాబు, జోమి తదితరులు పాల్గొన్నారు.

ఇంజనీరింగ్ సిబ్బందికి సాంకేతిక శిక్షణ

అమలాపురం టౌన్, ఆగస్టు 20: అమలాపురం పంచాయతీరాజ్ అతిథి గృహంలో మంగళవారం ఇంజనీరింగ్ సిబ్బందికి టెక్నికల్ వర్క్ షాప్ నిర్వహించారు. ఏషియన్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ ఇన్వెస్ట్‌మెంట్ బ్యాంక్ సాంకేతిక సలహాదారు ప్రభాకరరెడ్డి ముఖ్యఅతిథిగా పాల్గొని పంచాయతీరాజ్ ఇంజనీరింగ్ సిబ్బందికి సీసీ, బీటీ రోడ్లు నిర్మాణంలో మెలకువలను వివరించారు. పూర్తి నాణ్యతా ప్రమాణాలతో పనులు జరిగేలా చూడాలన్నారు. మరోక సలహాదారు నరసింహారావు సివిల్ యాప్‌పై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో పీఆర్ ఈఈ కె.చంటిబాబు, ఇంజనీర్స్ అసోసియేషన్ రాష్ట్ర ఆర్గనైజింగ్ కార్యదర్శి అన్యం రాంబాబు, డీఈఈలు పీఎస్.రాజు, కుమార్, సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

పీఎంపీల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తా : వేగుళ్ల



మండపేట, ఆగస్టు 20: పీఎంపీ, ఆర్ఎంపీ వైద్యుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని ఎమ్మెల్యే వేగుళ్ల జోగేశ్వరరావు చెప్పారు. మండపేటలో మంగళవారం కమ్యూనిటీ పారామెడికల్ ప్రైమరీ హెల్త్‌కేర్ ప్రొవైడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్, పీఎంపీఅసోసియేషన్ ఆధ్వర్యంలో జరిగిన సదస్సులో ఆయన మాట్లాడారు. స్థానిక వల్లూరి నారాయణమూర్తి కల్యాణ మండపంలో జరిగిన కార్యక్రమానికి సంఘ అధ్యక్షుడు కె.సత్యనారాయణ అధ్యక్షత వహించారు. పీఎంపీల సేవలు సామాన్యులకు అవసరమన్నారు. పీఎంపీ సమస్యలు సీఎం చంద్రబాబు దృష్టికి తీసుకువెళ్లి పరిష్కారానికి కృషిచేస్తానన్నారు. డెల్టా ఆసుపత్రి వైద్యులు సుమంత్ కేన్సర్ వ్యాధిపై అవగాహన కల్పించారు.

పర్యావరణ పరిరక్షణకు సైకిల్ యాత్ర

రాయవరం, ఆగస్టు 20: లొల్ల గ్రామానికి చెందిన విశ్వమానవతా సంస్థ వ్యవస్థాపకుడు అల్లూరి శ్రీనివాసచౌదరి మంగళవారం లొల్ల నుంచి సైకిల్ యాత్ర చేపట్టారు. యాత్రను లొల్ల సర్పంచ్ చాత్రాతి జానకి రాంబాబు ప్రారంభించారు. ఈసందర్భంగా శ్రీనివాసచౌదరి మాట్లాడుతూ మండపేట, అనపర్తి నియోజకవర్గాల్లో రోజుకు 20 కిలోమీటర్లు సైకిల్ యాత్ర చేపట్టి ప్రభుత్వ పాఠశాలలు, పీహెచ్‌సీలు, ఆరోగ్య ఉపకేంద్రాల వద్ద 400మొక్కలు నాటి వాటి పరిరక్షణ బాధ్యతలు విద్యార్థులకు అప్పగించనున్నట్లు చెప్పారు. తొలుత రాయవరం హైస్కూల్‌లో మొక్కలు నాటారు.

నేటి నుంచి ఓటర్ల జాబితా సవరణ

ముమ్మిడివరం, ఆగస్టు 20: ముమ్మిడివరం అసెంబ్లీ నియోజకవర్గ ఓటర్ల జాబితా సవరణ కార్యక్రమం ఈనెల21 నుంచి సెప్టెంబరు 21 మధ్య పూర్తి చెయ్యాలని ఓటర్ల నమోదు అధికారిణి, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ ఎం.ఝాన్సీ నాలుగు మండలాల సహాయ ఓటర్ల నమోదు అధికారులను, బూత్ లెవెల్ అధికార్లు, సూపర్‌వైజర్లను ఆదేశించారు. ప్రచురితమైన ఓటర్ల జాబితాలో మార్పులు, చేర్పులకు ఫారం-7,8 దరఖాస్తుల స్వీకరణ, వచ్చే ఏడాది జనవరి ఒకటో తేదీ నాటికి 18ఏళ్లు నిండుతున్న వారి నుంచి ఫారం-6 దరఖాస్తులు స్వీకరించాలన్నారు. ఇంటింటికి వెళ్లి ఈకార్యక్రమాన్ని పూర్తి స్థాయిలో విజయవంతంగా నిర్వహించాలని పిలుపు ఇచ్చారు.

కామెర్ల మందు పంపిణీ వద్ద కొట్లాట

ద్రాక్షారామ, ఆగస్టు 20: వెల్లలో ఈనెల18న కామెర్ల మందు పంపిణీ వద్ద ఇరువర్గాల మధ్య కొట్లాట చోటుచేసుకుంది. కామెర్ల మందు పంపిణీ చేసే ఒక కుటుంబంపై మరో కుటుంబం చెడు ప్రచారం చేయడంతో కొట్లాటకు దారితీసింది. ఆచంట దుర్గ, కొటారి రమణ, నంగి ధనలక్ష్మిలు పాముల వీరభద్రరావు, చక్రధరరావు గుండుబోగుల లక్ష్మణరావుల ప్రోత్సాహంతో తనపై దాడి చేసి గాయపరిచారని కవల కనకదుర్గ ద్రాక్షారామ పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఆనాల మణికంఠస్వామి నాయుడు, ఆనాల శ్రీనులు కలసి తనను కొట్టి గాయపరిచారని కొటారి రమణ అనే మహిళ ఫిర్యాదు చేసింది. గాయపడిన ఇద్దరు రామచంద్రపురం ఏరియా ఆసుపత్రిలో చేరారు. ఆసుపత్రినుంచి వచ్చిన సమాచారంతో ద్రాక్షారామ ఏఎస్ఐ డి.వి.వి రమణారావు కేసు నమోదు చేశారు.

కాల్వలో పడి వ్యక్తి మృతి

ఉప్పలగుప్తం, ఆగస్టు 20: ఎన్.కొత్తపల్లి రాజుపాలేనికి చెందిన మాజీ మునసబు, సీనియర్ టీడీపీ నాయకుడు ఈదరపల్లి సూర్యనారాయణరాజు కుమారుడు సత్యనారాయణరాజు(సత్తిబాబు) (56) ప్రమాదవశాత్తూ పంటకాల్వలో పడి మృతి చెందాడు. సోమవారం తెల్లవారుజామున పొలం సమీపంలోని పంటకాల్వలో సత్తిబాబు మృతదేహాన్ని స్థానికులు కనుగొన్నారు. సత్తిబాబు ఆకస్మిక మృతి పట్ల గ్రామస్తులు దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు.

ఆకతాయిలకు కౌన్సిలింగ్

ముమ్మిడివరం, ఆగస్టు20: ముమ్మిడివరంలో అతివేగంగా ద్విచక్రవాహనాలు నడుపుతున్న పలువురు యువకులను అదుపులోకి తీసుకుని ఎస్ఐ డి.జ్వాలసాగర్ మంగళవారం కౌన్సిలింగ్ ఇచ్చారు. జడ్పీ బాలికల ఉన్నత పాఠశాల వద్ద ఆరు మోటార్‌సైకిళ్లపై యువకులు రేష్ డ్రైవింగ్ చేస్తుండగా వారిని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. వారి తల్లిదండ్రులను పిలిపించి పిల్లలతో పాటు వారి తల్లిదండ్రులకు కౌన్సిలింగ్ ఇచ్చారు. ద్విచక్రవాహనాలను అతివేగంగా నడిపితే చర్యలు కేసులు తప్పవని ఆయన యువతను హెచ్చరించారు